కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కోర్కెల్లో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వీణవంక, డిసెంబర్ 10: మండలంలోని కోర్కెల్ గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామివారి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా జరిపించారు. ఏటా ఆనవాయితీ ప్రకారం నిర్వహించే శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు 27 హోమగుండాలతో, 108 జంటలతో సుదర్శన మహాయాగం నిర్వహించారు. మధ్యాహ్నం దాత మేకల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తిరునగరి వేణుగోపాలస్వామి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఏటా శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వీటిని మరింత అత్యంత వైభవంగా నిర్వహించడానికి, ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పాలక మండలి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుదర్శన మహాయాగంలో పాల్గొన్న భక్తులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

వీణవంక, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సుమారు 48 సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కచోట కలిశారు. కుటుంబ సమేతంగా హాజరై, సభా ముఖంగా పరిచయం చేసుకున్నారు. కష్టసుఖాలను పంచుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆడిపాడి సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడి, పాదాభివందనం చేశారు. అందరూ కలిసి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో 1974-75 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వీణవంకలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1974-75 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మంత్రులను కలిసిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీటీసీ

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్: 10: ఉమ్మడి జిల్లా నుంచి ఇటీవల మంత్రులుగా నియామకమైన దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ పటిష్టానికి పాటుపడాలి

సైదాపూర్, డిసెంబర్ 10: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఎన్నికల ఫలితాలతో బీఆర్ఎస్ కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని సూచించారు. కేసీఆర్ రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా మరిన్ని మంచి ఫలితాలను తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టానికి పాటుపడాలని సూచించారు.

శివాలయానికి ప్రధాన ద్వారం ఏర్పాటు

శంకరపట్నం, డిసెంబర్ 10: మండలంలోని తాడికల్ శివాలయానికి ప్రధాన ద్వారాన్ని దాతల సహాయంతో ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బత్తిని మల్లిక-మల్లికార్జున్‌గౌడ్ ఇందుకు సహకరించారు. రూ. 30 వేల విలువైన ప్రధాన ద్వారం పురాతన శివాలయానికి ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 10: పట్టణంలోని మామిళ్లవాడలో రాత్రి గ్యార్వీ షరీఫ్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పట్టణంలో జెండాతో ఊరేగింపు నిర్వహించారు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఖవ్వాలి శ్రోతలను అలరించింది. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, కౌన్సిలర్ బీ యాదగిరినాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ ఇమ్రాన్, ఎండీ సలీం, ఎండీ గఫార్, మైనార్టీ నాయకులు అఫ్సర్ పాషా, నవాబ్ పాషా, సిరాజ్, ఫర్మన్ హది, ఎండీ ఖలీద్‌హుస్సేన్, అలీమ్, ఎస్‌కే జలీల్, నవాజ్, సల్మాన్, సాబీర్, సమీర్, మున్ను, చాంద్, రియాజ్, నియాజ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కల్చరల్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఖవ్వాలి నిర్వహిస్తున్న గాయకులు

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 10: హైదరాబాద్ యశోద దవాఖానలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి కలిశారు. ఇటీవల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తుంటి ఎముకకు శస్త్రచికిత్స జరుగగా, ఆదివారం యశోద దవాఖానకు వెళ్లారు. కేసీఆర్‌ను చూసిన తర్వాత కేటీఆర్‌తో మాట్లాడారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు అడ్డగట్ట మురళి, మండలి సత్యం ఉన్నారు.

బస్వాపూర్ వాసికి జ్యోతిష్య రత్న అవార్డు

వేణుగోపాలచారిని సత్కరిస్తున్న చందు, సాంబశివరావు, నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 10: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన బ్రహ్మశ్రీ శ్రీ రామోజు వేణుగోపాలచారికి తెలుగు వెలుగు విశిష్ట జోతిష్య రత్న జాతీయ గౌరవ పురస్కారం పొందారు. ఈమేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో తెలుగు వెలుగు జాతీయ పురస్కార మహోత్సవాన్ని నిర్వహించారు. మహోత్సవంలో జ్యోతిష్య, వాస్తు, అర్చక రంగంలో సేవలందిస్తున్న వేణుగోపాలచారికి జ్యోతిష్య రత్న అవార్డును నాసా శాస్త్రవేత్త, రిటైర్డ్ చందు సాంబశివరావు, రిటైర్డ్ ఐఎఎస్, డ్వాక్రా గ్రూపు ఫౌండేషన్ చైర్మన్ సాంబశివ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి సంతోషం వ్యక్తం చేసి, తెలుగు వెలుగు సాహితి వేదిక నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేదారేశ్వరాలయంలో ఘనంగా సహస్ర దీపోత్సవం

వేములవాడ టౌన్, డిసెంబర్ 10: మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ కేదారేశ్వరాలయంలో సహస్రదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీక మాసంలో దీపోత్సవాన్ని నిర్వహించామని ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేశ్ తెలిపారు. మహిళలు స్వస్తిక్, లింగాకారంగా దీపాలు వెలిగించడంతో ఆలయంలో ఆధ్మాత్మిక వాతావరణం కనిపించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని

సైదాపూర్, డిసెంబర్ 10: మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థిని అంజలి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హాణ, పీడీ విష్ణువర్ధన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న కరీంనగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అంజలి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.

సింగిల్ విండో డైరెక్టర్ మృతి

చిగురుమామిడి, డిసెంబర్ 10: కరీంగనర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎడవల్లి భాస్కర్ రెడ్డి (64) శనివారం రాత్రి తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. భాస్కర్ రెడ్డి చాలాకాలం తిమ్మాపూర్ మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో విధులు నిర్వర్తించారు. పోలంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ విరమణ పొంది బీఆర్ఎస్‌లో చేరి, పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల్లో పనిచేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. భాస్కర్‌రెడ్డి అంత్యక్రియలు సోమవారం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భాస్కర్ రెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్, సీపీఐ జాతీయ నేత చాడ వెంకట రెడ్డి, ఎంపీపీ కొత్త వినీత, జడ్పీటీసీ గీకురు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జక్కుల రవి, ఎంపీటీసీ ఏలేటి రవీందర్ రెడ్డి, గ్రామాధ్యక్షుడు బోయిని రమేశ్, సింగిల్ విండో డైరెక్టర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.